

21వసారి

ఎస్పీ మణికంఠ రక్తదానం

చిత్తూరు ఎస్పీ మణికంఠ 21వ సారి రక్తదానం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిత్తూరులోని పోలీసు శ్వేద మహిళల బ్యారక్‌లో పోలీసుశాఖ సిబ్బందికి హెల్త్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ రక్తదానం కూడా చేశారు. తాను ఇప్పటి వరకు 21 సార్లు రక్తదానం చేశానని ఆయన తెలిపారు.నాలుగు నెలలకోసారి రక్తాన్ని దానం చేస్తే ఆరోగ్యంగా ఉంటామన్న విషయం అందరూ తెలుసుకోవాలన్నారు.రక్తదానంతో ఏ విధమైన అనారోగ్యమూ తలెత్తదని గ్రహించాలన్నారు.పోలీసులకు డ్యూటీ సమయాలు భిన్నంగా ఉంటాయని,ఆరోగ్య విషయంలో ఏమరుపాటు తగదన్నారు.సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకుని సమస్యలుంటే తగిన చికిత్సలు తీసుకుని ఆరోగ్యవంతులుగా ఉంటేనే విధులు సమర్థవంతంగా నిర్వహించగలమన్నారు. ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

కళ్యాణ ఘడియలు



- వచ్చే రెండు నెలల్లో 18 శుభ ముహూర్తాలు
- పురోహితుల నుంచి ఫొటోగ్రాఫర్ల దాకా పెరిగిన డిమాండ్

సుమారు ఏడాది తర్వాత అధిక సంఖ్యలో ముహూర్తాలు రావడంతో జిల్లాలో పెళ్లిళ్ల సందడి మొదలైంది. నవంబరు 12 నుంచి డిసెంబరు 16 వరకు సుమారు 18 ముహూర్తాలు ఉండడంతో తల్లిదండ్రులు తమ బిడ్డల్ని ఓ ఇంటివారిని చేసే పనిలో పడ్డారు.పురోహితులకు, మంగళ వాయిద్యాల వారికి, వంట మనుషులకు, డెకరేషన్ చేసేవారికి, భజంత్రీల వారికి, ఫొటోగ్రాఫర్లకు, ఎలక్ట్రీషియన్స్‌కు, ఈవెంట్ మేనేజర్స్‌కు, బ్యూటీషియన్స్‌కు, షామియానా, వేదిక అలంకరణ, పూల దండలు, పండ్లు, కొబ్బరికాయలు, ఐస్‌క్రీం తదితర వృత్తిదారులకు చేతి నిండా పని దొరికిందనిచెప్పవచ్చు.

-చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● కళ్యాణ మండపాలకు పెరిగిన డిమాండ్

కళ్యాణ మండపాలకు డిమాండ్ బాగా పెరిగింది. నెల రోజుల ముందే బుక్ చేసుకుంటున్నారు.ఎక్కువమంది ఏసీ మండపాలే కోరుకుంటున్నారు. కొన్ని కళ్యాణమండపాల నిర్వాహకులు పెళ్లివారికి ఇబ్బంది లేకుండా కేటరింగ్, డెకరేషన్, పురోహితులు, బ్యాండు, భోజనాలు' ఏర్పాటుచేసి ప్యాకేజీ రూపంలో వసూలు చేస్తున్నారు. చిత్తూరు నగరంలో సుమారు 17 మండపాలున్నాయి. వాటితో పాటు పెళ్ళిళ్ల నిర్వహించే 6 ఆలయాలున్నాయి. నవంబరు 12 నుంచి ఇవన్నీ బిజీ అయిపోయాయి. అలాగే పుంగనూరులో 12 మండపాలు, నగరిలో 10 మండపాలు, పలమనేరులో ఆరు మండపాలుండగా.. దాదాపు అన్నీ బుక్ అయిపోయాయి. మండపాల స్థాయిని బట్టి రూ.40 వేల నుంచి రూ.లక్షల వరకు వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలవారు సమీప పట్టణాల్లోని చిన్న షాపుల్లో తాళి బొట్లు కొనుగోలు చేస్తుండగా, సంపన్నులు మాత్రం బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు వెళ్లి ఆభరణాలు కొనుగోలు చేస్తున్నారు.

● ముహూర్తాలివే

నవంబరులో 12, 13, 17, 18, 22, 23, 25, 26, 28, 29 తేదీలు. డిసెంబరులో 4, 5, 9, 10, 11, 14, 15, 16 తేదీలు శుభప్రదమైన రోజులుగా పండితులు చెబుతున్నారు. ఆ తర్వాత సంక్రాంతి మూఢాలు వస్తే.. ఫిబ్రవరి, మార్చి నెల వరకు ముహూర్తాలకోసం ఆగాల్సిందే.

● చిత్తూరులో నగరంలో ఇదీ పరిస్థితి

చిత్తూరు నగరంలో 17 మండపాలు, పెళ్లిళ్ల నిర్వహించే ఆరు ఆలయాలు ఉండగా.. నవంబరు 12 నుంచి డిసెంబరు 16 వరకు సుమారు 140 పెళ్లిళ్లు జరగనున్నాయి. కళ్యాణ మండపాలు దొరకని పరిస్థితిలో కొందరు ఆలయాల్లో పెళ్లి చేసుకునేందుకు ప్లాన్ చేసుకున్నారు.

గత డీఎంహెచ్‌వో శ్రీహరిపై విచారణ

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గతంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌వో)గా పనిచేసిన శ్రీహరిపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టారు. ఇందుకోసం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రాష్ట్ర స్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు గుంటూరు డీఎంహెచ్‌వో విజయలక్ష్మిని విచారణ అధికారిగా నియమించారు. సోమవారం జిల్లాకు వచ్చిన ఆమె స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ మొదలుపెట్టారు. 2021 మే నుంచి 2022 డిసెంబరు మధ్య కాలంలో శ్రీహరి పనిచేశారు. ఈ సమయంలో వైద్యశాఖలో అక్రమ డిప్యుటేషన్లు, ప్రైవేటు ఆస్పత్రుల నుంచి భారీగా ముడుపులు తీసుకున్నారనే దానిపై పలు ఫిర్యాదులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు వెళ్లాయి. ఈ ఫిర్యాదులపై అప్పటి రికార్డులు, ఫైల్స్‌ను విజయలక్ష్మి పరిశీలించారు. శాఖలోని పలువురు సిబ్బందిని పిలిపించి విచారించారు. ఈ విచారణ మంగళవారం కూడా కొనసాగనుంది. దాదాపు 40మందిని ప్రశ్నించనున్నట్లు సమాచారం.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఐదేళ్ల జైలు



ఏసురత్నంరెడ్డి

గంగాధరనెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష పడింది. గంగాధరనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ వివరాలను సోమవారం మీడియాకు తెలిపారు. గంగాధరనెల్లూరు మండలం బాలగంగనపల్లె పంచాయతీ నాగూరుపల్లెకు చెందిన ఏసురత్నంరెడ్డి (52)ని ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో పట్టుకుని 2017లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై తిరుపతి రెడ్‌శాండిల్ కోర్టులో నిందితుడిని హాజరుపరచరగా ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.6లక్షలు జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ విజేత చిత్తూరు



ట్రోఫీ అందుకున్న క్రీడాకారులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. కర్నూలు డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఈనెల 25 నుంచి ఆదివారం రాత్రి వరకు రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయి. రాజమండ్రి జట్టుపై విజయం సాధించి ఫైనల్స్ చేరుకున్న మన జిల్లా జట్టు.. కర్నూలు జట్టుతో తలపడి 90-58 స్కోర్‌తో విజయకేతనం ఎగురవేసి చాంపియన్ షిప్ ట్రోఫీని సొంత చేసుకుంది. బాస్కెట్ బాల్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు పర్యవేక్షణలో జేమ్స్ బాబు, జాను కోచ్‌లుగా వ్యవహరించారు. గెలుపు పొందిన జట్టును బాస్కెట్ బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెంగల్రాయనాయుడు అభినందించారు.

15న కాణిపాకంలో కార్తీక దీపోత్సవం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ ఆలయమైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో నవంబరు 15వ తేదీన కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో గురుప్రసాద్ తెలిపారు. ఆ రోజున మణికంఠేశ్వరస్వామి ఆలయంలో సాయంత్ర ఆరు గంటలకు జ్వాలా తోరణం, కార్తీక దీపోత్సవం ఉంటాయన్నారు. ఇందులో భాగంగా 4, 11, 18, 25న కార్తీక సోమవారాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామస్తులు, ఉభయదారులు పాల్గొనాలని ఈవో కోరారు.

నేరగాళ్ల కదలికలపై సాంకేతిక నిఘా



- జిల్లావ్యాప్తంగా 790మంది రౌడీషీటర్లు.. 1600 మంది అనుమానితులు
- వారి కదలికలు పసిగట్టేలా ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్
- సీఎం చంద్రబాబు ఆదేశాలతో కదిలిన పోలీసులు

చిత్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరగాళ్లకు, అసాంఘిక శక్తులకు సాంకేతిక పరిజ్ఞానంతో అడ్డుకట్ట వేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను అమలు చేసే ఏర్పాట్లలో పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది.790 మంది రౌడీషీటర్లను, 1600 మంది అనుమానితుల్ని (దొంగతనం కేసుల్లో పట్టుబడినవారు) స్టేషన్ల వారీగా పోలీసులు ఇప్పటికే గుర్తించారు. తొలి దశలో రౌడీషీటర్లకు సంబంధించిన సమగ్ర వివరాలను డిజిటలైజ్ చేసే పనిలో ఉన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, మాల్స్‌తో పాటు బహిరంగ ప్రదేశాల్లో ఇప్పటికే ఉన్న ఇంటర్నెట్ ప్రోటోకాల్ బేస్డ్ కెమెరాలను పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తున్నారు. కెమెరాల ఐపీ అడ్రస్‌లను సేకరించి జియో ఫెన్సింగ్‌లోకి తీసుకొస్తారు. ఇలా చేస్తే రౌడీలు, అనుమానితుల కదలికల్ని గమనించవచ్చు. వాళ్లు ఏం తప్పు చేసినా వెంటనే ఆ ప్రాంత పోలీసులకు సమాచారం వెళ్లిపోతుంది. జిల్లాలో అవసరమున్న ప్రతి ప్రాంతంలోనూ ఏర్పాటు చేసేందుకు 9 వేల జనరల్ సీసీ కెమెరాలు కావాలని జిల్లా పోలీసు శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదన కూడా పంపింది.

● ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్ అంటే..

జిల్లాలోని రౌడీషీటర్లు, అనుమానితులు, నేర చరిత్ర ఉన్నవారిపై పోలీసులు సాంకేతిక నిఘా పెట్టనున్నారు. ముఖ కవళికలను గుర్తించే వ్యవస్థ (ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్- ఎఫ్ఆర్ఎస్) సాంకేతికత కలిగిన సీసీ కెమెరాల ద్వారా వారి కదలికలను నిరంతం గమనిస్తూ ఉంటారు. నేరాలకు పాల్పడక ముందే నియంత్రించడం, ఏదైనా నేరం చేస్తే వెంటనే అదుపులోకి తీసుకోవడం దీని ప్రధాన లక్ష్యం. మూడు నెలల్లోగా ఈ సిస్టమ్‌ను పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురానున్నారు.

● 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని పలుచోట్ల అమలు చేసి సత్ఫలితాలను సాధించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక పూర్తిగా నిర్వీర్యం చేశారు.

ప్రాణాపాయ స్థితిలో మహిళ

● చైన్ దొంగల దాడిలో పోరాడిన ఫలితం



వెంటిలేటర్‌పై ఉన్న ప్రమీల

చిత్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మెడలో బంగారు గొలుసులను లాక్కెళ్లే దొంగల ముఠా జిల్లాలో పెట్రేగిపోతోంది. శనివారం ఒకే రోజు మూడు చోట్ల దొంగతనాలు జరిగాయి. ఐరాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ మెడలో నుంచి 36 గ్రాముల చైను దొంగిలించారు. అదే రోజున పూతలపట్టు పరిధిలోనూ ఓ మహిళ వద్ద 56 గ్రాముల బంగారు చైను లాక్కెళ్లగా, మరో ప్రయత్నం విఫలమైంది. విఫలమైన చోరీలో ఆ దొంగలతో పోరాడిన మహిళ ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి. ఐరాల మండలం పుల్లూరుకు చెందిన ప్రమీల (56) శనివారం సొంతూరు నుంచి పూతలపట్టుకు స్కూటీలో బయల్దేరింది. హైవేలోని తేనెపల్లె టోల్‌ప్లాజాకు రెండు కిలోమీటర్ల ముందే ఉన్న తిప్పిరెడ్డిపల్లె వద్ద ఎదురుగా ఇద్దరు కుర్రాళ్లు కేటీఎం బైకులో వచ్చారు. అడ్రస్ అడిగే నెపంతో ఈమె స్కూటీని ఆపి, దగ్గరగా వచ్చారు. వారి మీద అనుమానం వచ్చిన ప్రమీల మెడలోని చైన్‌ను గట్టిగా పట్టుకుంది. అయినా ఆ దుండగులు ఆమె మెడను పట్టుకుని స్పీడుగా వెళ్లిపోయారు. దీంతో ఆమె కూడా స్కూటీలో నుంచి రోడ్డు మీద పడిపోయింది. చైన్‌ను మాత్రం కాపాడుకుంది. కానీ, తీవ్రస్థాయిలో గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆమెను శనివారం సాయంత్రమే రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆమె చికిత్సకు స్పందించడం లేదు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నా.. ఆరోగ్యం మెరుగు పడటం లేదు.

కాణిపాక ఆలయ ప్రధాన అర్చకుడి సస్పెన్షన్

ఇన్‌చార్జిగా గణేష్ గురుకుల్ నియామకం



సోమశేఖర్‌గురుకుల్



గణేష్ గురుకుల్

ఐరాల(కాణిపాకం),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్‌ను సస్పెండ్ చేసినట్లు సోమవారం సాయంత్రం ఈవో గురుప్రసాద్ తెలిపారు. తన పదోన్నతి కోసం తప్పుడు ధ్రువీకరణ పత్రాలను ఆలయానికి సమర్పించారంటూ సోమశేఖర్ గురుకుల్‌పై లాయర్ రవికుమార్ ఆరునెలల క్రితం దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.దీంతో అప్పటి ఈవో వెంకటేశుకు తప్పుడు ధ్రువపత్రాల విషయాన్ని పరిశీలించి నివేదికను అందించాలని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆలయంలో దేవదాయ శాఖ అధికారులు సోదాలు నిర్వహించగా ఆయన ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలు తప్పుడు పత్రాలని తేలింది.అయితే సోమశేఖర్‌గురుకుల్‌కు అప్పటి ఆలయ ధర్మకర్తల మండలి అండ ఉండడంతో ఈవో ఏం చేయలేకపోయారు. ఈ విషయంపై లాయర్ రవికుమార్ కోర్టులో దావా వేశారు.ఈ నేపథ్యంలో ఈవోగా వచ్చిన గురుప్రసాద్ దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు నెల క్రితం ధ్రువీకరణ పత్రాలపై నివేదిక పంపించారు.దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆలయ ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడిగా ఎస్.ఎస్.గణేష్ గురుకుల్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పుంగనూరుకు ఆగిన శుద్ధజలాలు

మూతపడిన 10 ఆర్వో ప్లాంట్లు ● నిర్వహణభారం భరించలేమంటూ చేతులెత్తేసిన వైసీపీ నేతలు

పుంగనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పుంగనూరులో పేద ప్రజలకు ఉచితంగా శుద్ధజలాలను అందించే ఆర్వో ప్లాంట్లు నాలుగు నెలలుగా మూతపడ్డాయి.వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీగా ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ఉండటంతో 10 ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఎంపీ ల్యాడ్స్, ఆంధ్రప్రదేశ్ సౌర ఉత్పత్తి సంస్థ నిధులతో ఒక్కొక్క మినరల్ వాటర్ ప్లాంటును రూ.6లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. 2018 నుంచి 2023 అక్టోబరు నడుమ ఎన్ఎస్‌పేట బీడీ కాలనీ, చెక్కరమలిగివీధి, కుమ్మరవీధి, తాటిమాకులపాళ్యం,



మార్కెట్ యార్డు వద్ద మూతబడ్డ ఆర్వో ప్లాంటు

ఎల్ఐసీ కాలనీ, రహ్మత్‌నగర్, ఉబేదుల్లా కాంపౌండ్, ఏటిగడ్డపాళ్యం, ఈస్టుపేట, మార్కెట్‌యార్డు వద్ద ఈ ప్లాంట్లను ప్రారంభించారు.మున్సిపాలిటీ నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించేవారు. వీటి నిర్వహణకు ఒక్కో వ్యక్తిని నియమించి వేతనాలు ఇచ్చేవారు.ఆర్వో ప్లాంట్ల నిర్వహణకు మున్సిపాలిటీకి నెలకు దాదాపు రూ.లక్ష వ్యయమయ్యేది. ఎన్నికల్లో పెద్దిరెడ్డిని, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డిని ప్రజలు మళ్లీ గెలిపించినా వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆర్వో ప్లాంట్ల నిర్వహణపై చేతులెత్తేశారు.ప్రభుత్వ నిధులతో ప్లాంట్లు పెట్టినప్పటికీ నిర్వహణ గురించి ప్రభుత్వ అనుమతి, ఆదేశాలు లేకపోవడంతో మూతపడ్డాయి. ఇటీవల మున్సిపల్ మీట్‌లో ఆర్వో ప్లాంట్లను మళ్లీ తెరిపించాలని కౌన్సిలర్లు చర్చించారు. తాటిమాకులపాళ్యంలో మాత్రం టీడీపీ మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాశ్ చొరవ తీసుకుని ప్లాంటు నిర్వహణకు ఒకరిని పెట్టారు. శుద్ధజలాలు అవసరమైన వారివద్ద క్యానుకు రూ.5 చొప్పున తీసుకుని నిర్వహింపజేస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ప్లాంట్లు తెరుచుకోలేదు. ప్రభుత్వ నిధులు వెచ్చించి తెప్పించిన ప్లాంట్ల పరికరాలు నిరుపయోగంగా పడివున్నాయి. ప్రస్తుతం పట్టణంలో దాదాపు 15 మినరల్ వాటర్ ప్లాంట్లు క్యాన్‌కు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నా పలుచోట్ల నీటి నాణ్యతపై ఫిర్యాదులున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఈ విషయమై తగిన చర్యలు తీసుకుని మూతపడిన ప్లాంట్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డితో మాట్లాడగా ఆర్వో ప్లాంట్ల మూసివేతను ఓ కౌన్సిలర్ ఇటీవల కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్వో ప్లాంటు



పచ్చని పొలంలో తెల్ల కొంగలు

వ్యవసాయ పనులు ఊపందుకుంటున్న వేళ పొలాల్లో కొంగల సందడి ఎక్కువైంది. దమ్ము చేసిన పొలాల్లో, ఏపుగా పెరిగిన పచ్చని పైరుల మధ్య, పిల్ల గాలులకు కొంగలు అటు ఇటు ఎగురుతూ కనువిందు చేస్తున్నాయి. పంటలకు కీడు తలపెట్టే పురుగులను ఏరి తింటూ రైతులకు మిత్రుల్లా సాయం చేస్తున్నాయి. నాగలాపురం మండలం గోపాలపురం వద్ద పొలాల్లో గుంపులుగా వాలిన కొంగలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- సత్యవేడు, ఆంధ్రజ్యోతి

ఏంటి సిస్టర్ ఇది?

స్విమ్స్‌లోని ఓపీ విభాగం సోమవారం రోగులతో కిక్కిరిసిపోయివుంది. న్యూరాలజీ ఓపీ విభాగంలో వందమందికి పైగా రోగులు వైద్యుల అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అక్కడ బీపీ, పల్స్ చూడాల్సిన స్టాఫ్‌నర్సు ఇలా ఫోను చూస్తూ ఉన్నారు. మధ్యమధ్యలో కాసేపు బీపీ చెక్ చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం



ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

చంద్రగిరి, అక్టోబరు 28: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయనం నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. పవిత్రోత్సవాల కారణంగా సోమవారం నుంచి బుధవారం వరకు కల్యాణోత్సవం, మంగళవారం స్వర్ణపుష్పార్చన, బుధవారం అష్టోత్తర శతకళశాభిషేకం, ఆర్జితం సేవలను టీటీడీ రద్దు చేసింది. గృహస్థులు(ఇద్దరు) రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. పవిత్రం, ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్‌రెడ్డి, అనంబట్లు ధనశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రాస్ రూ.50 లక్షల విరాళం



సీఎంకు చెక్కు అందజేస్తున్న రాస్ నిర్వాహకులు

తిరుపతి(ఆటోనగర్),అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల చెక్కును అందజేశారు. రాస్ ద్వారా చేస్తున్న సామాజిక కార్యక్రమాలను వివరించారు. సీఎం మాట్లాడుతూ బాధితులను ఆదుకోవడానికి రాస్ చేసిన సాయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 20 సూత్రాల పథకం మాజీ చైర్మన్ టీ.శేషసాయిబాబు, రాస్ సంయుక్త కార్యదర్శి ఎం.మమత, సూపరింటెండెంట్ వి.నాగరాజు పాల్గొన్నారు.







పద్మనాభం కుటుంబం



శ్రమజీవన సౌందర్యం

పుత్తూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెల్లవారకముందే ఆ అమ్మాయి పశువుల కొట్టంలోకి వెళ్తుంది. పేడ జవిరి కుప్ప పోస్తుంది. చీపురు అందుకుని ఊడవడం మొదలుపెడుతుంది. ఆ వెంటనే తమ్ముడు రంగంలోకి దిగుతాడు. పశువులన్నింటినీ కడిగి శుభ్రం చేస్తాడు. చిన్నతమ్ముడు పాల క్యాన్‌లతో అక్కా అన్నలకి సాయంగా వస్తాడు. దానా వేసి, కగుడు నీళ్లు తాగించి, పాలు పితికి క్యాన్‌లు నింపుతారు. అక్క ప్రియదర్శిని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్. సివిల్స్‌కి కోచింగ్ తీసుకుంటోంది. పెద్ద తమ్ముడు ఉమేష్ ఇంజనీరింగ్ ఫైనలియర్. చిన్నవాడు శశికిరణ్ నీట్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఇన్‌స్టాలో రీల్స్ కోసం చేసిన ఫోటో షూట్ కాదు ఇది.. వారి దినచర్య. వ్యవసాయ కుటుంబాల్లో శ్రమకు ఉండే గౌరవానికి ప్రతీకగా కనిపిస్తుంది ఆ కుటుంబం. పుత్తూరులో నారాయణవనం రోడ్డులో వీరి నివాసం. నాన్న పద్మనాభానిది నారాయణవనం మండలం ఎరికంబట్టు. 60 సెంట్ల భూమి.. గంపెడు కుటుంబం.. రెక్కలు ముక్కలు చేసుకునేవారు. రెండు బర్రెలు పట్టుకుని భార్య ఆసరాగా నిలచింది. ఇంతలో అతనికి పోలీసు ఉద్యోగం వచ్చింది. పిల్లలు బాగా చవుకుని వృద్ధిలోకి రావాలనే కల నెరవేర్చుకోవడానికి పోలీసు జీతం ఎంత? రెక్కల కష్టాన్ని తమ పిల్లలకు కూడా వారసత్వంగా ఆ తండ్రీ, తల్లీ అందించారు. వారి మనసెరిగిన ఆ బిడ్డలూ తమ గుడ్డలు నలుగుతాయని వెరవలేదు. ఇంజనీరింగ్ చదువుతూ పేడ పనేమిటని సిగ్గు పడలేదు. స్నేహితుల ముందు అవమానం అని ఎన్నడూ అనుకోలేదు. చదువుకుంటూనే అన్ని పనులూ చేస్తున్నారు. ఇప్పుడు వారి దగ్గర 14 ఆవులు, నాలుగు బర్రెలు ఉన్నాయి. కాలేజీకి వెళ్లే ముందూ, వచ్చిన తర్వాత కూడా ఆ ముగ్గురు పిల్లలూ ఒళ్లు అలిసేలా శ్రమిస్తారు. కష్టం చేస్తూ కళకళలాడుతూ తిరిగే వీరిని చూసి 'దేవుడు దీవించి మావాడికి మంచి బిడ్డల్ని ఇచ్చాడు' అని పద్మనాభం తల్లిదండ్రులు ఆనందంగా చెప్పుకుంటారు.

'అపుస్మా' సాయం రూ.65 లక్షలు



తిరుపతి విద్య, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) 65 లక్షల రూపాయల విరాళాన్ని అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల నుంచి విరాళాల ద్వారా అపుస్మా ఈ మొత్తాన్ని సమీకరించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్యదర్శి కె.తులసి విష్ణు ప్రసాద్, రాయలసీమ జోన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి తదితరులు సోమవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. అపుస్మా కార్యవర్గాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జనార్దన్ రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూకు ఎన్‌ఆర్‌ఐ రూ.10 లక్షల విరాళం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూకు ఎన్‌ఆర్‌ఐ జేవీ లక్ష్మణరావు రూ.10 లక్షలు విరాళాన్ని అందించారు. యూనివర్సిటీ దూరవిద్యా విభాగం పరిధిలోని సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని కోరారు. ఈ మొత్తానికి సంబంధించి చెక్కును వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు ఆయన అందజేశారు. రాజమండ్రికి చెందిన లక్ష్మణరావు ప్రస్తుతం చికాగోలో ఉంటున్నారు. యూనివర్సిటీ డీడీఈ సైకాలజీ పీజీ కోర్సు చదువుకున్నారు. గతంలో ఇండియా ట్రిబ్యూన్ పత్రిక ఎడిటర్‌గా పని చేశారు. ఈ క్రమంలో తన తల్లిదండ్రుల పేర యూనివర్సిటీ డీడీఈ సైకాలజీ క్లాస్ రూమ్ నిర్మించాలని దాత లక్ష్మణరావు కోరారు. ఈయన్ను అధికారులు సత్కరించారు. ఇదిలా వుండగా, 87 ఏళ్ల వయసులో లక్ష్మణరావు యూనివర్సిటీ డీడీఈలో సైకాలజీ పీజీ చదవడం గమనార్హం.

మంత్రి ఎదుట కూటమి నేతల పంచాయితీ



జిల్లా ఎన్డీయే కూటమి నేతల సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

- ఎమ్మెల్యే ఎందుకయ్యామా అని బాధేస్తోందన్న బొజ్జల సుధీర్
- టీడీపీ, జనసేన నేతల వాగ్వాదంతో శ్రీకాళహస్తి సమీక్ష నేటికి వాయిదా
- చంద్రగిరిలోనూ టీడీపీ, జనసేన నేతల వాగ్వాదం
- తిరుపతిలో అధికారులపై కూటమి నేతల ఫిర్యాదు
- ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ సూళ్లూరుపేట బీజేపీ నేతల ఫిర్యాదు

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'అనవసరంగా చెడ్డపేరు వస్తోంది. ఎమ్మెల్యేగా ఎందుకయ్యామా అని బాధేస్తోంది' అంటూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వాపోయారు. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో సోమవారం రాత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ నియోజకవర్గాల వారీగా కూటమి నేతలతో సమావేశాలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కూటమి నేతలతో మంత్రి సమీక్ష సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. తన నియోజకవర్గంలో ఇసుక అధికంగా ఉండటంతో ఎవరు పడితే వారు తవ్వకాలకు, అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. వాళ్లంతా తన పేరు చెప్పి చెడ్డపేరు తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, ఇరుగుపొరుగు నియోజకవర్గాల వారూ ఇక్కడి ఇసుకపై కన్నేసి దుర్వినియోగం చేస్తున్నారని, దాన్ని తనకు ఆపాదించి వైసీపీ అనుకూల మీడియా అప్రదిష్టపాలు చేస్తోందని వేదన చెందారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఇసుక అక్రమాలను అడ్డుకోవాలే తప్ప ఇలా నిరాశగా మాట్లాడడం తగదంటూ ఆయన్ను మంత్రి సత్యప్రసాద్ అనునయించారు. గత ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నేతలు బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. అప్పటి రెవెన్యూ అధికారులతో కలసి వైసీపీనేతలు పెద్ద ఎత్తున భూ రికార్డులు తారుమారు చేయడంతో ఇపుడు ప్రజల నుంచీ ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని వివరించారు. వాటి పరిష్కారానికి ఇపుడున్న రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో పనిచేయడం లేదన్నారు. భూ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ఇసుక విషయంలో పాత వైసీపీ విధానాన్నే అనుసరిస్తున్నందున చెడ్డపేరు వస్తోందని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అభిప్రాయపడ్డారు. అధికారులతో పకడ్బందీగా పనిచేయిస్తే చెడ్డపేరు రాదన్నారు. తమకు ఎలాంటి ప్రాధాన్యతా లేదని, ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవడం లేదంటూ జనసేన ఇంఛార్జి నగరం వినుత తదితరులు ఫిర్యాదు చేశారు. వైసీపీపై పోరాడిన తమపై 17 అక్రమ కేసులున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, టీడీపీ గెలుపునకు పనిచేయలేదని, ప్రచారానికి దూరంగా ఉన్నారని టీడీపీ నేతలూ ప్రత్యారోపణ చేశారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నడుమ వాగ్వాదం చోటుచేసుకోవడంతో మంత్రి సమావేశాన్ని ముగించారు. మంగళవారం ఉదయం మరోసారి సమావేశమవుదామని వాయిదా వేశారు.

అర్థంతరంగా ముగిసిన 'సత్యవేడు' సమావేశం

సత్యవేడు సమీక్షకు సస్పెన్షన్‌లో ఉన్న కారణంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కాలేదు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త శ్రీపతి బాబు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంఛార్జులు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా హాజరు కావడంతో గొడవ జరిగింది. తొలుత ఎమ్మెల్యే అనుకూల వర్గానికి చెందిన నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై సస్పెన్షన్ విధించడంతో అభివృద్ధి పనులు జరగడం లేదని మంత్రి ఎదుట వాపోయారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండు చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఓడిపోవాలనే ఉద్దేశంతో ఇండిపెండెంట్ అభ్యర్థికి అనుకూలంగా పనిచేసిన హేమలతను సమావేశానికి ఎలా పిలిచారంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వైసీపీ వారికి పనులు చేస్తున్నారని, కాబట్టి సస్పెన్షన్ ఎత్తివేయకూడదని వ్యతిరేక వర్గ నేతలు పట్టుబట్టారు. తమకు ఎలాంటి ప్రాధాన్యతా ఇవ్వడం లేదంటూ జనసేన నేతలు మంత్రికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సమావేశం రచ్చరచ్చగా మారడంతో వచ్చే నెల 10 లేదా 11న ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేస్తామంటూ మంత్రి సమీక్షను ముగించారు.

చంద్రగిరి జనసేన నేతపై ఫిర్యాదు

చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన నేత తీరుపై పలువురు టీడీపీ నాయకులు మంత్రికి ఫిర్యాదు చేశారు. తొలుత జనసేన నేత ఒకరు తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, రాజకీయంగా అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని ఆరోపించడంతో టీడీపీ నాయకులు ఎదురు దాడికి దిగారు. భూవివాదాలు, కబ్జాల్లో తలదూర్చి కూటమి పార్టీలకు, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని ఫిర్యాదు చేశారు. వైసీపీ ముఖ్యనేతతో రాజీపడి, వైసీపీ వర్గీయులకు అనుకూలంగా సిఫారసులు చేస్తున్నారని ప్రస్తావించారు. ఓ మహిళా నేత తన వ్యక్తిగత సమస్య విషయంలో జనసేన నేత ప్రత్యర్థులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. దీంతో మంత్రి సర్దిచెప్పారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ మాట్లాడుతూ ఏ స్థాయి నాయకుడు సిఫారసు చేసినా వైసీపీ వ్యక్తులకు పనులు చేయనని, వైసీపీకి అనుకూలంగా పనిచేసిన వారి బదిలీలకు సిఫారసు చేయనని తేల్చి చెప్పారు.

వైసీపీ కార్పొరేటర్లను చేర్చుకోవద్దు

తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి నేతలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసి, దౌర్జన్యాలతో ఏకగ్రీవాలైన వైసీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకోవద్దంటూ పలువురు నేతలు ఇన్‌చార్జి మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఒక పార్టీ చేర్చుకోకపోతే మరో పార్టీలో చేరే అవకాశాలు ఉంటాయి కదా? అన్న మంత్రి ప్రశ్నకు.. కూటమి పార్టీలన్నీ ఒకే మాటపై ఉంటే వైసీపీ వాళ్లకు అవకాశం ఉండదని, రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీలో కష్టపడిన నాయకులకు కార్పొరేటర్ టికెట్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. దీనిపై అధిష్ఠానంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి బదులిచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపైనా టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వీఐపీల పర్యటనల్లో తమకు సమాచారం ఉండడంలేదని, వైసీపీ నాయకులతో అనుకూలంగా వ్యవహరిస్తున్నారని చెబుతుండగా..జనసేన నాయకులు ఖండించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పలువురు మహిళా నేతలు కోరారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, బొజ్జల సుధీర్, పులివర్తి నానీ, జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్, బీజేపీ నేత అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా సత్యవేడువాసి



చంద్ర ధనశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ దంపతులు

సత్యవేడు, అక్టోబరు 28: రాష్ట్ర హైకోర్టులో సోమవారం ముగ్గురు అదనపు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ ముగ్గురిలో ఒకరు సత్యవేడుకు చెందిన ప్రముఖ న్యాయవాది తూటా చంద్ర ధనశేఖర్ అలియాస్ టీసీడీ శేఖర్. ఈయన చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ప్రతిమ సుశీల్‌కుమార్ రెడ్డితో పాటు పలువురు పట్టణ ప్రముఖులు హాజరై ఆయనకు అభినందనలు తెలిపారు. కాగా, చంద్రధనశేఖర్ 1988లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్‌లో నమోదయ్యారు. మాజీ అడ్వకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పరాంకుశం వేణుగోపాల్ వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ చేశారు. ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులై వాణిజ్య పన్నుల శాఖ తరఫున వాదనలు వినిపిస్తున్నారు. సివిల్, క్రిమినల్, రెవెన్యూ ట్యాక్స్, భూసేకరణ చట్టాలకు సంబంధించిన కేసులు వాదించడంలో ఆయన దిట్ట అని పేరు ఉంది. ఈయన తండ్రి తూటా చంద్రశేఖరన్ పట్టణంలో ప్రముఖ న్యాయవాదిగా కొనసాగుతున్నారు.

గంజాయి కేసులో బీసీఏ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న బీసీఏ విద్యార్థిని సోమవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి నుంచి 150 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. తాటితోపు రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లారన్నారు. పోలీసులను చూసి ఇద్దరు పరారవడానికి ప్రయత్నించగా.. బీసీఏ విద్యార్థిని పట్టుకున్నట్లు చెప్పారు. అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పూల ధరలకు రెక్కలు

దీపావళి ఎఫెక్ట్



వైలెట్ రకం చామంతి



సెంట్ ఎల్లో రకం చామంతి



సెంట్ వైట్ రకం చామంతి

దీపావళి పండుగ పూల రైతులకు కాసుల వర్షం కురిపిస్తోంది.రెండు రోజులుగా పూల ధరలకు రెక్కలు వచ్చాయి.సోమవారం వి.కోట పూల మార్కెట్‌లో కిలో బంతి పూలు గరిష్టంగా రూ. 40 వరకు పలకగా, కిలో చామంతి పూలు అత్యధికంగా రూ. 150 వరకు పలికాయి. బటన్ రోస్ కిలో రూ. 200 పలికింది. వి.కోటలో పూల వ్యాపారుల మధ్య పోటీ తలెత్తడంతో ధరలు ఒక్కసారిగా రెట్టింపయ్యాయి. వారం రోజుల క్రితం బంతి పూలు 30 కిలోల బస్తా రూ. 50 నుంచి వంద వరకు పలికేది. చామంతి కిలో రూ. 20 నుంచి 30 వరకు పలికేది. బటన్ రోస్ కిలో రూ. 80 వరకు మాత్రమే పలకగా, సోమవారానికి రెట్టింపు ధరలు పలకడంతో పూల రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. వి.కోట ప్రాంతంలో పండించే పూల నాణ్యత బాగుండడంతో పుణ్యక్షేత్రాల్లో మంచి గిరాకీ ఉంది. వి.కోట నుంచి తిరుపతి, హైదరాబాదు, శ్రీశైలం, విజయవాడ, రాజమండ్రి, మదురై, చెన్నై, బెంగళూరు, కోల్‌కత్తా తదితర ప్రాంతాల్లోని పుణ్య క్షేత్రాలకు పూలను ఎగుమతి చేస్తారు. దీపావళి సీజన్ కావడంతో పూలకు మరింత డిమాండు పెరిగింది. వారం రోజుల ముందు కురిసిన వర్షాల వల్ల పూల తోటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడులు తగ్గిపోయాయి. వ్యాపారుల మధ్య కొనుగోళ్ళకు పోటీ రావడంతో పూల ధరలు అమాంతం పెరిగాయి. రెండు రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులంటున్నారు. రెండు వారాల క్రితం వర్షాలతో పూలకు సరైన ధరలు లేకపోవడంతో కోతకోసిన పూలను రైతులు మార్కెట్‌కు తరలించినా అక్కడ కొనేవారు లేక రోడ్డు పక్కన పడేశారు. అదే నేడు పూల తోటల వద్దకే వ్యాపారులు తోటలను తమకే ఇవ్వాలం టూ క్యూకడుతున్నారని రైతులు చెబుతున్నారు.

- వి.కోట, ఆంధ్రజ్యోతి



ఎల్లో రకం బంతిపూలు



బటన్ రోస్ పూలు



చామంతి

రెవెన్యూ సమస్యలే అధికం

- కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 146, పోలీసుశాఖకు 28 అర్జీలు





అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన అర్జీల్లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయి. కలెక్టరేట్‌లో బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో పుల్లయ్య, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర జిల్లా అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ అర్జీలను స్వీకరించారు.

ప్రధాన సమస్యలివిలా..

- తమ అనుభవంలో ఉన్న వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేయాలని బంగారుపాళ్యం మండలం కోలావూరు ఎస్టీకాలనీకి చెందిన చిన్నక్క, ప్రమీల కలెక్టర్‌ను కోరారు. తమకు పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలని స్థానిక అధికారులను కోరినా ఫలితం లేదన్నారు.
- కౌండిన్య నదిపై వంతెన నిర్మించి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతి నాయుడు కోరారు. పలమనేరు మండలం పెంగరకుంట పంచాయతీలోని మొసలిమడుగు, ఏటిగడ్డయానాది కాలనీతోపాటు కౌండిన్యనదికి అవతల ఉన్న మరికొన్ని గ్రామాలవారు దారిలేక కొన్నేళ్లుగా అవస్థలు పడుతున్నారని చెప్పారు. నది మధ్యలో చెక్‌డ్యామ్‌లు నిర్మించారని, నీరు అధికంగా ఉండటం వల్ల దాటలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నదికి పక్కన ఉన్నవారు 15 కిలోమీటర్లు దూరం వెళ్లి పలమనేరుకు రావాల్సి ఉందన్నారు. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.
- వృద్ధాప్యం, అంగవైకల్యంతో ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ను మంజూరు చేయడం లేదని జీడీ నెల్లూరు మండలం జూపల్లెకు చెందిన విమల అనే వృద్ధురాలు తెలిపారు. 63 శాతం అంగవైకల్యం ఉన్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.
- అనుభవంలోని భూమికి పట్టాదార్‌పాసుపుస్తకాన్ని ఇవ్వాలని చౌడేపల్లె మండలం తిరునపల్లెకి చెందిన ద్రాక్షాయణి కోరారు. సర్వే నెంబరు 456లో 1.50 ఎకరాల భూమి 30 ఏళ్లుగా తన అనుభవంలో ఉందన్నారు.
- కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలని వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామస్తులు కోరారు. గ్రామంలో 40 కుటుంబాల వారు నివాసముంటున్నారని తెలిపారు. దారి సౌకర్యం లేక మండల కేంద్రానికి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీలివిలా..

కలెక్టరేట్‌కు మొత్తం 146 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 121, పోలీసుశాఖకు 4, డ్వామా, ఎంపీడీవో, ఐసీడీఎస్, మున్సిపాలిటీలు, ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పంచాయతీరాజ్, విద్యాశాఖలకు కలిపి 21 ఉన్నాయి.

పోలీసు కార్యాలయానికి వచ్చిన వాటిల్లో..

జిల్లా పోలీసు కార్యాలయానికి 28 అర్జీలు అందాయి, వీటిల్లో.. భూ తగాదాలపై 8, డబ్బు తగాదాలపై 6, ఇంటి తగాదాలపై 3, కుటుంబ తగాదాలపై 5, ఆస్తి తగాదాలపై 3, చీటింగ్‌పై 2, వేధింపులపై ఒకటి ఉన్నాయి.

మంటలు చెలరేగి.. కారు దగ్ధం



పూతలపట్టు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ కారులో మంటలు చెలరేగడంతో దగ్ధమైంది. పెంచలకోనకు చెందిన మాలకొండయ్య తమ కుటుంబీకులతో కలిసి బెంగళూరుకు కారులో బయల్దేరారు. పూతలపట్టు మండలం గోపాలక్రిష్ణాపురం సమీపాన సిక్స్‌లేన్ రోడ్డులో వెళుతుండగా ఆదివారం అర్ధరాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా వాహనం నుంచి పొగ వచ్చింది. గమనించిన మాలకొండయ్య వాహనాన్ని రోడ్డు పక్కన, అందులోని వారందరినీ దించేశారు. ఆ వెంటనే మంటలు ఎక్కువై వాహనం పూర్తిగా దగ్ధమైంది. వాహనంలో ఉన్న ఐఫోన్ కూడా కాలి బూడిదైందని బాధితులు తెలిపారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- మరొకరికి గాయాలు



అజ్మల్ మృతదేహం

పెనుమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని కలవగుంట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీలో సోమవారం విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఫ్యాక్టరీలో వైరింగ్ పనులకు బంగారుపాళ్యం మండలం కీరమంద గ్రామం నుంచి ముగ్గురు యువకులు వచ్చారు. పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ మహబూబ్ కుమారుడు ఎస్.అజ్మల్(19)కు విద్యుదాఘాతం తగలడంతో స్పృహ కోల్పోయాడు. అతడి పక్కనే ఉన్న సాయికి కూడా షాక్ తగిలి గాయపడ్డాడు. వీరిద్దరితో వచ్చిన వంశీ అప్రమత్తమై అక్కడున్న వర్కర్ల సాయంతో బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించాడు. అప్పటికే అజ్మల్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అజ్మల్ తల్లి యస్మీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మధు తెలిపారు.

రేపు ప్రభుత్వ పెన్షనర్లతో సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో సమావేశం జరుగుతుంది. ఈ మేరకు ఆ శాఖ డీడీ రామచంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సంఘ నాయకులు కూడా పాల్గొని సమస్యలు ప్రస్తావిస్తే వీలైనంతవరకు పరిష్కరిస్తామన్నారు.

పలమనేరు కమిషనర్‌కు జాతీయస్థాయి అవార్డు



ఎల్‌వి.రమణారెడ్డి

పలమనేరు, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎల్.వి. రమణారెడ్డి జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. స్వనిధి సే సమృద్ధి పథకం అమలులో గణనీయమైన సేవలందించినందుకుగాను మున్సిపల్ కమిషనర్‌కు జాతీయస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ అవార్డును ఈనెల 29వ తేది విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ చేతుల మీదుగా అందుకోనున్నారు. ఆ మేరకు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి తాడేపల్లిలోని మెప్మా డైరెక్టర్ సమాచారం అందించారు.

జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టులోని క్రీడాకారులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారండీఎస్‌ఏ క్రీడా మైదానంలో అండర్-14 జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ జరిగింది. ఎంపికైన క్రీడాకారుల్లో.. నిహార్, రెహమాన్, తరుణ్‌కుమార్, ఇజహార్, చరణ్‌నాయక్, మణిదీప్, గురుచరణ్, ధనుష్, సాయి, లిఖిత్, గోవర్ధన్, రక్షిత్, మోహిత్, కన్నన్, హాజిత్, కుమర్ దోని, స్టాండ్‌బైలో ముని, నీరబ్, దీక్షిత్, దివినేష్, మానికేతన్, హరి, జయప్రకాష్, భిబన్ ఉన్నారు. నవంబరులో అమలాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జట్టు పాల్గొంటుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంతవాణి తెలిపారు.

కంచికామకోటి పీఠాధిపతికి వరసిద్ధుడి ప్రసాదాలు



ఐరాల (కాణిపాకం), అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): కంచికామకామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతికి సోమవారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో గురుప్రసాద్ స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. కలిగిరి కొండ మహావిష్ణు ఆలయంలో జరిగిన మహాకుంభాభిషేకానికి విచ్చేసిన ఆయన్ను ఈవో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి,సీఎఫ్‌వో నాగేశ్వరరావు, బాలాజీనాయుడు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ముంబై హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మంగేష్.ఎస్.పాటిల్ సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం



చిరంజీవి (ఫైల్ ఫొటో)

నగరి అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని రామాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. నిండ్ర మండలం ఇరుగువాయికి చెందిన చిరంజీవి యాదవ్ (54) నగరి టీఆర్‌కండ్రిగ వద్ద అక్వేరియం షాపును నడుపుతున్నాడు. రోజు ఉదయాన్నే నగరి డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ చేశాక రామాపురానికి బైక్‌పై వెళ్లి అక్కడున్న గోవులకు అరటిపండ్లు పెట్టేవాడు. తర్వాత గోపంచితం తీసుకుని ఇరుగువాయిలోని వినాయకస్వామికి పూజలు చేశాక షాపునకు వెళ్లేవాడని స్థానికులు తెలిపారు. సోమవారం కూడా గోపంచితం పట్టుకుని బైక్‌పై బయల్దేరాడు. ఉదయం 7.30 గంటలకు రామాపురం వద్ద వెనుకనుంచి వేగంగా వచ్చిన కాంక్రీట్ మిక్సర్ కంటైనర్ అదుపుతప్పి బైక్‌ను ఢీకొనడంతో అతను మధ్యటైరు కిందపడి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో ఆయన మృతదేహం చాలావరకు ఛిద్రమైంది. ఈ మేరకు నగరి సీఐ మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలిగిరి కొండ మహావిష్ణు ఆలయంలో

మహా కుంభాభిషేకం

- కంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో పూజలు



విజయేంద్ర సరస్వతితో ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

పెనుమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని కలిగిరి కొండ కింద వెలసిన శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణు ఆలయంలో కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదంతో మాస సంప్రోక్షణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ ఆలయ నిర్మాణం 2002లో మాజీ ఎంపీ చెంగల్రాయ నాయుడు చేపట్టారు. అప్పట్లో ఈ ఆలయాన్ని విజయేంద్ర సరస్వతే ప్రారంభించి.. ప్రాణప్రతిష్ఠ చేశారు. 2014లో చెంగల్రాయనాయుడు కుటుంబీకులు ఈ ఆలయాన్ని కంచి కామకోటి పీఠానికి అప్పగించారు. అప్పటినుంచి వారి ఆధ్వర్యంలోనే పూజలు జరుగుతున్నాయి. సోమవారం చెంగల్రాయ నాయుడు కుమారుడు ఎస్‌పీ వెంకటేశ్వర చౌదరి దంపతుల ఆధ్వర్యంలో సుమారు 50మంది వేదపండితులు మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పీఠాధిపతికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ స్వాగతం పలికారు. మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి దంపతులు, ఎస్పీ జయప్రకాష్ దంపతులు, రుద్రయ్యానాయుడు, వెంకటేశ్ చౌదరి, హరిబాబునాయుడు, తలారి రెడ్డెప్ప, భాస్కర్, శ్రీధర్‌యాదవ్, యువరాజులు నాయుడు, సురేష్‌చౌదరి, రాజశేఖర్‌నాయుడు, సునీల్ చౌదరి, భక్తులు పాల్గొన్నారు.

10 లక్షల టీడీపీ సభ్యత్వాల నమోదే లక్ష్యం

- చిత్తూరు ఎంపీ, పూతలపట్టు ఎమ్మెల్యే వెల్లడి



శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న తెల్లగుండ్లపల్లె సర్పంచ్ మాధవి

తవణంపల్లె, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 10 లక్షల టీడీపీ సభ్యత్వాల నమోదే లక్ష్యమని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. సోమవారం తవణంపల్లె మండలంలోని తెల్లగుండ్లపల్లెలో జరిగిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎ.గొల్లపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్, కొండ్రాజుకాల్వ సర్పంచ్ పరంధామనాయుడు దంపతులు, తెల్లగుండ్లపల్లె సర్పంచ్ మాధవి మోహన్‌నాయుడు దంపతులు ఐదుగురు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వీరిని నాయకులు అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, మండల అధ్యక్షుడు గాలి దిలీప్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఎంపీటీసీ రాధకృష్ణ, నాయకులు శరవణ, శ్రీధర్ యాదవ్, రవిచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పంలో పోలీసుల విస్తృత తనిఖీలు

- రెండు రోజుల్లో 84 కిలోల గంజాయి మొక్కల స్వాధీనం
- 1.2 కిలోల ఎండు గంజాయి కూడా
- ఆరుగురు నిందితుల అరెస్టు



నిందితులతో డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్

కుప్పం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కుప్పం డివిజన్ పరిధిలో రెండు రోజుల్లో ఏకంగా 34.800 కిలోల పచ్చి గంజాయితోపాటు 1.2 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో సోమవారం కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రామకుప్పం మండలం సింగసముద్రం పంచాయతీ కుప్పిగానిపల్లెలో జయప్ప పొలంవద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఆయన పొలంలో గంజాయి సాగు చేయడాన్ని గుర్తించి 14 కిలోల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని నిందితుడు జయప్పను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే మండలంలోని వీర్నమల పంచాయతీ గురుకులమడుగులో గోవిందస్వామి, రాజు పొలాల్లో సైతం గంజాయి సాగు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పొలంలో మొక్కలను పెంచి, అక్రమ గంజాయి వ్యాపారం చేస్తున్నారు. వీరి పొలంలో ఏకంగా 50 కిలోల పచ్చి గంజాయి మొక్కలను, మరో 800 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులిద్దరినీ అరెస్టుచేసి కోర్టుముందు హాజరు పరచి, రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు ఆదివారం కూడా శాంతిపురం మండలం అబకలదొడ్డి గ్రామానికి చెందిన చంద్రప్ప పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు తేలింది. వీరి పొలంనుంచి 5 కిలోల పచ్చి గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగు చేసినా, విక్రయించినా, సేవించినా, రవాణా చేసినా నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని చెప్పారు. యువత గంజాయి మత్తులో పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో రాళ్లబూదుగూరు, గుడుపల్లె ఎస్ఐలు నరేశ్, డి.శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న పచ్చి, ఎండు గంజాయి

పలమనేరు

కుప్పం/పుంగనూరు

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ

కుప్పం, అక్టోబరు 28: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పంలోని కడా సమావేశపు హాలులో సోమవారం ఆయన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించి, ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ వస్తున్నాయని కలెక్టర్ ఇటీవల నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం గుర్తు చేశారు. వచ్చిన అర్జీలు వచ్చినట్లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కడా పరిధిలోని కుప్పం డివిజన్‌లోని ప్రజా సమస్యలు, అభివృద్ధి గురించి నేరుగా సీఎంవో పర్యవేక్షిస్తున్నందున అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని, లేదంటే క్రమశిక్షణ చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పలు విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చల్లా సమక్షంలో టీడీపీలో చేరికలు



రొంపిచెర్ల, అక్టోబరు28: (ఆంధ్రజ్యోతి) ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అభివృద్ధిని చూసి వైసీపీని వీడి టీడీపీలో చేరామని మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు డి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం రొంపిచెర్ల పార్టీ కార్యాలయంలో పులిచెర్ల మండలం కమ్మపల్లెకు చెందిన 30 మంది వైసీపీ నాయకులు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. రమణారెడ్డి, గల్లా కృష్ణయ్య, రెడ్డెప్ప, భాస్కర, వెంకట్రామయ్య, వెంకటముని, పొడబ్బ, వెంకటప్ప, చెన్న కేశవులునాయుడు, చలపతి తదితరులకు చల్లాబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు, నాయకులు ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హబ్ అండ్ స్పీక్‌పై వర్క్‌షాపు ప్రారంభం



వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు

శాంతిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమహంస యోగానంద విద్యాలయంలో హబ్ అండ్ స్పీక్‌పై 12 జిల్లాల్లోని ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు జరిగే వర్క్‌షాపును సోమవారం ఎస్ఎస్ఏ అడిషనల్ పీడీ వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ ల్యాబ్ విస్తరణ, ఆవశ్యకత, ల్యాబ్ స్థాపన వెనుక ఉన్న ఆవిష్కరణలను వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, బీఆర్‌డీ వైద్యశాల చైర్మన్ డా.సురేష్‌బాబు, విద్యాలయం చైర్మన్ గోపాల్‌జీ అగర్వాల్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, ఎంఈఓలు చంద్రశేఖర్, వెంకటయ్య, జిల్లా సైన్స్ అధికారి రమణ, అటల్ టింకరింగ్ స్టేట్ టాస్క్‌ఫోర్సు మెంబర్ షాహీనాప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ల మధ్య జోరుగా మొక్కల పెంపకం



కుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కుప్పం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, డివైడర్ల మధ్య మొక్కల పెంపకం జోరుగా సాగుతోంది. ఇప్పటికే పెరిగిపోయిన మొక్కల ట్రిమ్మింగ్ కార్యక్రమం కూడా జరుగుతోంది. సోమవారం తెల్లవారుజామునే పట్టణ పర్యటనకు వచ్చిన కమిషనర్ శ్రీనివాసరావు మొక్కల పెంపకాన్ని పర్యవేక్షించారు. డివైడర్లలో గుంతలు తవ్వించి, మొక్కలు నాటించారు. అలాగే డివైడర్ల వెంట విచ్చలవిడిగా పెరిగిన బోగన్ విల్లా తదితర మొక్కలను ట్రిమ్ చేయించి అందమైన ఆకారంలోకి తెప్పించారు. ఆయా పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బైరెడ్డిపల్లె, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ఆచారివీధిలో నివాసమున్న వీరభద్రప్ప ఇంట్లో ఈనెల 20వ తేది జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఇదే గ్రామానికి చెందిన నిందితుడు పాండురంగను అరెస్టు చేసినట్లు గంగవరం సీఐ మురళీమోహన్ తెలిపారు. నిందితుడి నుంచి చోరీ చేసిన రూ.1,80,000 నగదు, ఒకజత వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. వీరభద్రయ్య ఇంట్లో ఈనెల 20వతేది చోరీ జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. బైరెడ్డిపల్లె ఎస్ఐ పరశురాముడు తమ సిబ్బందితో దర్యాప్తు చేప ట్టారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం దేవదొడ్డి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు పాండురంగను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అతడిని రిమాండుకు తరలించారు.

పుంగనూరువాసి నిజాయితీ

దొరికిన బంగారు గొలుసు బాధితురాలికి అప్పగింత



చిత్తూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తనకు దొరికిన బంగారు గొలుసును బాధితులకు అప్పగించి.. నిజాయితీ చాటుకున్నాడో పుంగనూరువాసి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి అంభోదర గ్రామానికి చెందిన పొన్మణి వచ్చారు. అర్జీ సమర్పించే క్రమంలో తన 30 గ్రాముల బంగారు గొలుసును పర్సులో పెట్టే ప్రయత్నంలో కింద పడేసుకున్నారు. అక్కడికి పుంగనూరుకు చెందిన మురళి కూడా వచ్చి ఉండటంతో ఆ గొలుసును చూశాడు. దీనికి తీసుకుని జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ వద్దకెళ్లి వివరాలు తెలిపాడు. డీఎస్పీ వెంటనే టూటౌన్ సీఐ నెట్టికంఠయ్యను పిలిపించి, విచారించాలని ఆదేశించారు. ఆయన కలెక్టరేట్‌కొచ్చి విచారించగా, ఆ గొలుసు పొన్మణికి చెందినదని నిర్ధారించారు. ఆమెను పోలీసు కార్యాలయానికి తీసుకెళ్లి, ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో మురళి ద్వారా గొలుసును అప్పగించారు. మురళి నిజాయితీని చూసిన ఎస్పీ ఆయనకు నగదు బహుమతి అభినందించారు.

పులిచెర్ల టు పాకాల

పుల్లావాండ్లపల్లి సమీప అడవిలో ఏనుగుల తిష్ట



ధ్వంసమైన వరి పంటను పరిశీలిస్తున్న ఎఫ్‌బీఓ శ్రీదేవి

కల్లూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట, చల్లావారిపల్లి పంచాయతీల్లో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు విధ్వంసం కొనసాగింది. దీంతో మామిడి, వరి, టమోటా తదితర పంటలకు నష్టం వాటిల్లింది. ముందుగా 16 ఏనుగుల గుంపు పాతపేట సమీపం చేరుకుని ముస్తాక్‌అహ్మద్‌కు చెందిన మామిడిచెట్లు, రాతి కూసాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. అటవీశాఖ సిబ్బంది టపాకాయలు పేల్చడంతో వారిపై ఏనుగులు తిరగబడ్డాయి. సమీపంలోని చల్లావారిపల్లి వద్దకు చేరుకొని శేషాద్రి నాయుడుకు చెందిన అర ఎకరా టమోటా పంటను ఏనుగులు ధ్వంసం చేశాయి. చెంగ్రాయ నాయుడుకు చెందిన అరఎకరా టమోటా, సుధాకర్‌కు చెందిన ఎకరా వరిపంట, యర్రయ్యకు చెందిన అర ఎకరా వరిపంట, సావిత్రమ్మకు చెందిన అర ఎకరా వరి, లక్ష్మీదేవికి చెందిన అర ఎకరా వరి, గురుమూర్తి నాయుడుకు చెందిన పైపులను ధ్వంసం చేశాయి. అనంతరం పాతపాళ్యం అడవిలోకి చేరుకున్నాయి. సోమవారం పాకాల మండలం పుల్లావాండ్లపల్లి సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్టవేశాయి. ఏనుగుల కదలికను డ్రోన్ కెమరాలు, బైనాక్యులర్ల సాయంతో రేంజర్ థామస్ సుకుమార్, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్ఓ షఫి, ఎఫ్‌బీఓలు మున్నా, శ్రీదేవి గమనిస్తున్నారు. రాత్రికి పులిచెర్ల మండ లంలోకి వచ్చే అవకాశాలున్నాయని, ఏనుగులు మండలంలోకి రాకుండా కట్టడి చేస్తున్నామని అధికారులు తెలిపారు.

పరిశోధక విద్యార్థికి ప్రథమ బహుమతి



గుడుపల్లె, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి శతజయంతి ఉత్సవాల సందర్భంగా చైన్నైలో నిర్వహించిన ప్రసంగ పోటీల్లో ద్రావిడ వర్సిటీ తమిళ విభాగ పరిశోధక విద్యార్థి సెల్వకుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేతుల మీదుగా సెల్వకుమార్ అవార్డును అందుకున్నారు.

మున్సిపల్ డీఈఈ మృతి



కుప్పస్వామి (ఫైల్)

పలమనేరు,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ డీఈఈ కుప్పస్వామి(61) ఆదివారం రాత్రి మృతిచెందారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో తిరుపతిలోని ఆయన స్వగృహంలో మృతి చెందారు. కుప్పస్వామి మృతి పట్ల మున్సిపల్ కమిషనర్ ఎల్‌వీ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్వో రవిరెడ్డి, మున్సిపల్ ఏఈ ఉమేష్, మున్సిపల్ సిబ్బంది కుప్పస్వామి కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. కుప్పస్వామికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి) : పుంగనూరు తూర్పుమొగసాల వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పెద్దపంజాణి మండలం గట్టూరుకు చెందిన వెంకటేశ్ కుమారుడు పృథ్వీ(27) పుంగనూరుకు వచ్చి తూర్పు మొగసాల వద్ద స్నేహితుడితో మాట్లాడుతుండగా ద్విచక్రవాహనం అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో పృథ్వీ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అతడిని పుంగనూరు ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

నేడు పుంగనూరులో జాబ్‌మేళా

పుంగనూరురూరల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు శివార్లలోని ప్రభుత్వ మైనార్టీ ఐటీఐలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మూడు కంపెనీల యాజమాన్యాలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 18నుంచి 30 ఏళ్ల మధ్య వయసు కలిగి, 10వతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులకు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. వివరాలకు 7780599208 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి



పుంగనూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో సోమవారం భక్తుల కు దర్శనమిచ్చారు. అర్చ కులు బాలసుబ్రహ్మణ్యం, రామచంద్రస్వామిలు కాశీ విశ్వేశ్వర స్వామికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేయగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

చల్లాబాబుకు సత్కారం



రొంపిచెర్ల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని బోయకొండమ్మ ఆలయ పూజారులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆలయంలో నెలకొన్న సమస్యలు, భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిపారు. చల్లాబాబు మాట్లాడుతూ ఉన్నతాధికారులతో సంప్రదించి భక్తుల సమస్యలు, సిబ్బంది బాధలు పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని ఆయన చెప్పారు. ఆలయ ఈవో ఏకాంబరం, పూజారులు అసాది మల్లికార్జున, అసాది రమేష్, చంద్ర, హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు రొంపిచెర్ల మండల సమావేశం

రొంపిచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావల్సిందిగా కోరారు.

కందూరు హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

సోమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఈనెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ అండర్-17 బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు గోల్డ్ కప్పు సాధించింది. ఈ జట్టులో కందూరు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న తనీష్, దస్తిగిరి విశేష ప్రతిభ కనబరిచారు. అలాగే కర్నూలులో జరిగిన అండర్-19 అథ్లెటిక్స్ బాలికల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని కే.మౌనిక విజేతగా నిలిచింది. సోమవారం కందూరు హైస్కూల్‌లో విద్యార్థులను హెచ్ఎం వెంకట్రమణారెడ్డి, పీడీ. చిన్నప్ప, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి సెక్రటరీగా హరిప్రసాద్



రొంపిచెర్ల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ మండలి సెక్రటరీగా రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామానికి చెందిన నద్దల హరిప్రసాద్ నియమితుయ్యారు. ఈ మేరకు సోమవారం మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో ఆ పరిరక్షణ మండలి ప్రెసిడెంట్ బుల్లారాజావు నియామకపత్రం అందజేశారు.

టీడీపీ ఆర్థికసాయం

రామకుప్పం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగుకు చెందిన టీడీపీ కార్యకర్త కన్నమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ నేతలు విశ్వనాథ్, ఆనందకుమార్‌గౌడు, గోవిందప్ప, సంపత్, బాబు, కుమార్‌లు కన్నమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టాలి : టీడీపీ



పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం

శాంతిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పార్టీ శ్రేణులను కోరారు. సోమవారం శాంతిపురంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీలో లేని విధంగా టీడీపీ తన కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక కార్యక్రమం చేట్టిందన్నారు. రూ.100 రుసుంతో పార్టీ సభ్యత్వం స్వీకరించే వారికి పార్టీ గతంలో పార్టీ రూ.2లక్షలు బీమా సౌకర్యం కల్పించేదని, ఇకపై రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. రూ.లక్ష కడితే వారికి శాశ్వత సభ్యత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు చలపతిస్వామి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. గౌనివారి శ్రీనివాసులు రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేశానని, పార్టీ కూడా తనకు ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు.

సభ్యత్వ నమోదులో వి.కోట ఆదర్శంగా నిలవాలి



సభ్యత్వ నమోదును చూపిస్తున్న టీడీపీ శ్రేణులు

వి.కోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలని మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. వి.కోట పట్టణంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్ తదితరులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఏ రోజుకు ఆ రోజు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఆన్‌లైన్‌లోనే రూ.వంద చెల్లించి సభ్యత్వాన్ని నేరుగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షుడు ధీరజ్, శబరీస్, నేతలు రాంబాబు, సుబ్బన్న, సోము, నారాయణస్వామి, నాగభూషణం, శివకుమారి, హరినాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, చెంగప్పగౌడు, విశ్వనాథ్, శ్రీనివాసులు, రాము, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

సోమల : టీడీపీ సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. సోమవారం కందూరులో సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుట్టారు. మాజీ ఎంపీటీసీ పి. శ్రీనివాసులు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శంకర్, నౌషాద్, మాజీ సర్పంచు ఈశ్వరమ్మ, బాబయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు నడుమ పులిచెర్ల మండల మీట్

అభివృద్ధి పనులకు పూర్తి స్థాయిలో సహకరిస్తామన్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయం ముందు పోలీసులు

కల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల సర్వసభ్య సమావేశం పోలీసు బందోబస్తు నడుమ సోమవారం ప్రశాంతంగా జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ కారణాలతో మండల మీట్‌లు రెండు పర్యాయాలు వాయిదాపడ్డాయి. మండల మీట్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐలు సుదర్శన్‌ప్రసాద్, మునస్వామి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరసింహులు, సిబ్బంది, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. పులిచెర్లలోని పలు ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో జరిగే అభివృద్ధి పనులకు తోడ్పాటు అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు, తదితర కార్యక్రమాలను స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలన్నారు. వైద్యాధికారిణి షమామరెహ్మాన్ మాట్లాడుతూ అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి ట్యాంకులను నెలకు రెండు పర్యాయాలు శుభ్రం చేయించాలన్నారు. టీబీ వ్యాక్సిన్లు వేస్తున్నామని, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంఈఓ తాతయ్య మాట్లాడుతూ నాలుగు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దార్ జయసింహ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన రెడ్డివారిపల్లి, ఎల్లంకివారిపల్లి, దేవళంపేట గ్రామాల్లో వచ్చేనెల 5నుంచి గ్రామసభలు నిర్వహించి తప్పుఒప్పులను సరిదిద్దుతామన్నారు. ఎంపీడీవో రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా కార్యదర్శుల పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి తబ్రీస్‌బాషా, హౌసింగ్ ఏఈ యోగానంద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఏపీఓ షౌకత్, ఏపీఎం రమేష్, ఎంఈఓ శిద్దరామయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతమి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నక్కబండ రోడ్లపై పారుతున్న మురుగునీరు





పుంగనూరు నక్కబండలో రోడ్డుపై పారుతున్న ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు

పుంగనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణం నక్కబండ కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా తయారై ప్రజలు తరచూ అనారోగ్యంబారిన పడుతున్నారు. పలమనేరు రోడ్డులోని నక్కబండకాలనీని గత ప్రభుత్వం గుడిసెబండ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీలో విలీనం చేసింది. 15ఏళ్ల క్రితం ఇళ్లులేని పుంగనూరు పట్టణవాసులకు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ఇళ్ల నిర్మాణం చేసింది. ఎన్నికల సమయాల్లో మాత్రం రాజకీయ పార్టీల నాయకులు ఓట్ల కోసం నక్కబండ సమస్యలు తీర్చుతామంటూ హామీలు ఇవ్వడం తప్ప తర్వాత పట్టించుకోవడంలేదు. ప్రధానంగా మురుగునీరు వెళ్లేందుకు కాల్వలు లేక ఇళ్లలోని వ్యర్థపునీరు, వర్షంనీరు మొత్తం రోడ్లపైనే ప్రవహిస్తుంది. సిమెంట్ రోడ్లు నిర్మించినా మురుగునీటి కాల్వలు గురించి పట్టించుకోలేదు. మురుగునీటిని తొక్కుకుంటూ ప్రజలు వెళ్లాల్సివస్తోంది. రోడ్లపై మురుగునీరు వెళ్లకుండా కాల్వలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు పుంగనూరు మున్సిపల్ మీట్

పుంగనూరు మున్సిపల్ అత్యవసర సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్.అలీంబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కౌండిన్య నదిపై వంతెన నిర్మించాలి

పలమనేరు,అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం ముసలిమడుగు-ఏటిగడ్డిండ్లు మధ్య ప్రవహించే కౌండిన్యనదిపై వంతెన నిర్మించాలని కోరుతూ సోమవారం డీఆర్వోకు రైతు సంఘం నాయకుడు ఉమాపతి నాయుడు వినతిపత్రం అందజేశారు. పెంగరగుంట పంచాయతీలోని ఏటిగడ్డిండ్లు గ్రామస్తులు కౌండిన్యనది దాటి ముసలిమడుగు చేరుకుని అక్కడినుంచి పలమనేరుకు రావాల్సి వస్తోందన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

కల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం మరింత నాణ్యతగా ఉండాలని న్యాయవాది సలీం తెలిపారు. ఏపీ ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పాకాల కోర్టు న్యాయవాది సలీం సోమవారం కల్లూరు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న చిక్కీలు, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

కుప్పం, అక్టోబరు 28: కుప్పం ఎన్టీఆర్ కాలనీలో నివాసముంటున్న వేలంమల్ అనే మహిళ క్యాన్సర్‌తో నాలుగు నెలలనుంచి బాధపడుతోంది. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించుకోవడం కష్టసాధ్యంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ నవీన్ బృందం బాధితురాలిని పరామర్శించారు. ఆమెకు రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, కుప్పం టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, అప్పు ముఖేశ్‌లు కూడా వేలంమల్‌ను పరామర్శించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడలకు పుంగనూరు మండలం అడవినాథునికుంట మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లోకనాథం తెలిపారు. అండర్-14 కబడ్డీ జట్టుకు భరత్‌తేజ, అండర్-19 కబడ్డీ జట్టుకు ఎస్.మేఘన, విద్యశ్రీ, త్రోబాల్‌కు బి.ఐశ్వర్య, పుష్పలత, రన్నింగ్‌కు పి. సంధ్య ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

టీడీపీతోనే మహిళా సంక్షేమం

రామకుప్పం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంటేనే మహిళా సంక్షేమం సాధ్యమవుతుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి తెలిపారు. సోమవారం రామకుప్పంలో మండల మహిళా సమాఖ్య కొత్త కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందే ప్రోత్సాహకాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో నేతలు రామ్మూర్తి, సీతాపతి, మనోహర్, కామరాజనాయక్, గజేంద్ర, బాలరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం శ్రీనివాసమూర్తి, సీసీలు పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

బాధితులకు న్యాయం చేయాలి: కమిషనర్


అర్జీని పరిశీలిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు తొమ్మిది అర్జీలు అందాయి. ప్రజల నుంచి అర్జీలను కమిషనర్ నరసింహ ప్రసాద్ స్వీకరించారు. సమస్యలను పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చిన అర్జీల్లో.. ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగానికి మూడు చొప్పున, టౌన్‌ప్లానింగ్‌కు రెండు, మెప్మాకు ఒకటి ఉన్నాయి. అసిస్టెంట్ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకటరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కొప్పేడులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం


సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీడీపీ నాయకులు

నింద్ర, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నింద్ర మండలం కొప్పేడులో సోమవారం నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాలతో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. నాయకులు రవి నాయుడు, శివయ్య, రఘురామ్, మునస్వామి, గౌతమ్, భాస్కర్, ఆనంద్, తంగవేలు, గిరినాయుడు, మునస్వామి రెడ్డి, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాతపాళ్యం గ్రామానికి చెందిన భాగ్యరాజ్(30) ద్విచక్ర వాహనంలో స్వగ్రామం పాతపాళ్యం నుంచి పుల్లూరు రోడ్డుకు బయల్దేరాడు. కార్వేటినగరం మండలానికి చెందిన వీఆర్వో ప్రభాకర్ విధులు నిమిత్తం బైక్‌లో ఎస్ఆర్‌పురానికి వస్తున్నాడు. మార్గమధ్యంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

బాధితులను ఎస్ఆర్‌పురం పీహెచ్‌సీకి తరలించారు. భాగ్యరాజ్ తలకు బలమైన గాయమవడంతో 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ రావడం ఆలస్యమవుతుండటంతో ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ తన కారులో భాగ్యరాజ్ మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మానవత్వం చాటుకున్న ఎస్ఐని పలువురు అభినందించారు.

మురకంబట్టు మైదానంలో టపాకాయల విక్రయాలు : ఆర్డీవో

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు దీపావళి సందర్భంగా టపాకాయల విక్రయాలు మురకంబట్టు సర్వే నెంబరు 102 మైదానంలో విక్రయాలు చేపట్టనున్నట్లు ఆర్డీవో శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాకాయల లైసెన్స్ (తాత్కాలిక) దారులు పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీ మేరకు రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు స్థల పరిశీలన చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మురకంబట్టులోని హోండా షోరూం పక్కన ప్రభుత్వ మైదానంలో టపాకాయల విక్రయాలకు అనుమతి ఇచ్చినట్లు వివరించారు.

ఆధార్ క్యాంపును పరిశీలించిన ఎంపీడీవో

పాలసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఆధార్ ప్రత్యేక క్యాంపును ఎంపీడీవో కృష్ణమహేష్ రెడ్డి సోమవారం పరిశీలించారు. అలాగే వెంగళరాజుకుప్పం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈవోపీఆర్డీ రమేష్, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

సొంత భవనం కలేనా?

ఇబ్బంది పడుతున్న కార్వేటినగరం ఐసీడీఎస్ సిబ్బంది


ఐసీడీఎస్ భవనానికి కేటాయించిన స్థలం ఇదే

వెదురుకుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ హయాం (2014 సంవత్సరం)లో కార్వేటినగరం ఐసీడీఎస్‌కు సొంత భవన నిర్మాణానికి రూ.54లక్షలు మంజూరు చేశారు. ఎంపీడీవో కార్యాలయ సముదాయంలో స్థలం కూడా కేటాయించారు. పునాదుల వరకు వేశారు. కానీ, ఏమి జరిగిందో? ఏమో? అక్కడ పునాదులు కనిపించడం లేదు. ముళ్ల చెట్లు తప్ప. పనులు సకాలంలో జరగకపోవడంతో ఆ నిధులూ వెనక్కి వెళ్లిపోయాయి. మరోవైపు అద్దె భవనంలోనూ అరకొర వసతుల నడుమ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.

పెండింగ్ జీతాలు ఇప్పించాలి: 108 సిబ్బంది నిరసన


గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న సిబ్బంది

గంగాధరనెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమకు పెండింగ్ జీతాలు ఇప్పించాలంటూ 108 అంబులెన్స్‌లో పని చేసే సిబ్బంది డిమాండ్ చేశారు. రాష్ట్ర 108 అంబులెన్స్ యూనియన్ పిలుపుతో గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ వద్ద సోమవారం 108 సిబ్బంది నిరసన తెలిపారు. తమకు రోజుకు మూడు షిఫ్టుల పనివిధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, చేతన్, సందీప్, ప్రదీప్, చిట్టిబాబు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో 'విజయం' విద్యార్థుల ప్రతిభ


విజేతలుగా నిలిచిన విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక పలమనేరులో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో విజయం సీబీఎస్ఈ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.పరిణితి (9వ తరగతి), ఖాదరిన్ సుహానా ఖాన్ (టెన్త్), భార్గవ్ (8వ తరగతి).. శాస్త్రీయ దృక్పథం, ఆవిష్కరణలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

ఐవోటీపై వర్క్‌షాప్ : విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)పై వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నగరిలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న పోలీసులు

నగరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా సోమవారం నగరిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐలు మహేశ్వర్ (నగరి), హనుమంతప్ప (కార్వేటినగరం), భాస్కర్ (నగరి రూరల్) ఆధ్వర్యంలో స్థానిక ఏరియా వైద్యశాలలో ఈ శిబిరం జరిగింది. 120 మంది పోలీసులు, విద్యార్థులు రక్తదానం చేశారు.వైద్యశాల సూపరింటెండెంట్ జరీనా శిబిరాన్ని పర్యవేక్షించగా పుత్తూరు హెచ్‌డీ బ్లడ్‌బ్యాంకు వారు రక్తాన్ని సేకరించారు. వైద్యులు కార్తికేయన్, స్పందన, రాజరత్నమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవోకు సన్మానం

బంగారుపాళ్యం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన భవానీని బంగారుపాళ్యం తహసీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. సర్వేయర్ లావణ్య పాల్గొన్నారు.

టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక


సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యంనాయుడు

గుడిపాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు అన్నారు. సోమవారం మండలకేంద్రంలో టీడీపీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో వారు ప్రసంగించారు. ఎవరైతే అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయిస్తారో వారికి మొదటి బహుమతిగా రూ.10వేలు, రెండో బహుమతిగా రూ.5 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు ఇస్తారన్నారు. నాయకులు సాంబశివ నాయుడు, అనిల్‌కుమార్, గోళ్ళహరిప్రసాద్ చౌదరి, మురళీనాయుడు, అరుణ్, బాల సుబ్రహ్మణ్యం యాదవ్, శంకర్ చౌదరి, ఐజాక్, రవి నాయుడు, హరిబాబు నాయుడు పాల్గొన్నారు.

ఆవుదేవర నందీశ్వరుడికి పాలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో స్వామి

వెదురుకుప్పం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరుడికి సోమవారం పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఒకరి అరెస్టు


పట్టుబడ్డ నిందితుడు, స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేశారు. అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ శ్రీహరి రెడ్డి సోమవారం మీడియాకు వివరాలు తెలిపారు. ముందస్తు సమాచారంతో ఆదివారం చిత్తూరు - తిరుత్తణి రోడ్డులోని ఒంటిల్లు కృష్ణాపురం వద్ద దాడులు చేశారు. కృష్ణాపురానికి చెందిన శ్రీరాములు (52) ఇంట్లో తనిఖీలు చేయగా.. సుమారు 75వేల విలువైన 15 కర్ణాటక మద్యం బాక్సులు, టెట్రా ప్యాకెట్లు గుర్తించారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించాక మద్యం సరఫరా చేస్తున్న మరో ఇద్దరు వ్యక్తులపైనా కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్ఐ పృథ్వీరాజ్, సిబ్బంది శరవణ, ప్రసన్న కుమార్, దామోదర్, లోకేష్, సంధ్య తదితరులు పాల్గొన్నారని సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

సబ్‌స్టేషన్లలో ఆయుధ పూజ

పాలసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం, వెంగళరాజుకుప్పం,నరసింహాపురం,శ్రీకావేరిరాజుపురం గ్రామాలలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో సోమవారం ట్రాన్స్‌కో ఏఈ వరదరాజులు ఆధ్వర్యంలో ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం

వెదురుకుప్పం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యసనం వల్ల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా హెల్త్‌క్యాంపు

యాదమరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదమరి ఉన్నత పాఠశాలలో చిత్తూరు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సుందర్‌రాజన్ ఆధ్వర్యంలో మెగా హెల్త్‌క్యాంపు నిర్వహించారు. దాదాపు 300 మంది విద్యార్థులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. మనోరమ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు ప్రదీప్‌కుమార్, ఉదయ్‌కుమార్, ఉమా ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు ఉమాఖాన్, ఎంపీడీవో వేణు, హెచ్ఎం గిరిరాజ, టీచర్లు పాల్గొన్నారు.

'సాంకేతిక విద్య' ఫీల్డ్ ట్రిప్


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ పథకంలో భాగంగా శనివారం గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్య బ్యూటీ అండ్ వెల్నెస్ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో 9,10 తరగతి విద్యార్థులు, హెచ్ఎం రమేష్‌బాబు, టీచర్లు రేఖ, జయంతి, కుమార్ పాల్గొన్నారు.

2నుంచి స్కందషష్టి మహోత్సవాలు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చర్చివీధి జీవకారుణ్య అన్నదాన సమాజం ఆధ్వర్యంలోని సంఘ భవనంలో నవంబరు రెండు నుంచి ఎనిమిదో తేదీవరకు స్కందషష్టి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో తిమ్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం ఏడు గంటలకు జీవకారుణ్య అన్నదాన సమాజ భవనంలో ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు ఎం.పయణి స్కందపురాణం భక్తులకు వివరిస్తారన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..!


రోడ్డుపైకి వచ్చిన పిచ్చి మొక్కలు

పెనుమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు నుంచి పూత్తూరు రహదారిలో అల్లాల చెరువు కట్టపై రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పైగా అవి రోడ్డుపైకి వాలడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగా కనిపించడం లేదు. దీనికి తోడు రెండు మలుపులు ఉండటంతో ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదని వాహనదారులు అంటున్నారు.

'యువ భారత్ సంఘటన్' వార్షికోత్సవాలు


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న నెహ్రూ యువ కేంద్రం నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మేరా యువ భారత్ సంఘటన్ వార్షికోత్సవాలు నగరంలో సోమవారం ఘనంగా జరిగాయి. కేంద్రం అధికారులు బి.ప్రదీప్‌కుమార్, బాబురెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యవంతులుగా జీవనం సాగించాలన్నారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సపోర్ట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి చర్చివీధి, బజారువీధి, మార్కెట్ చౌక్, ప్రభుత్వాస్పత్రి తదితర ప్రధాన వీధుల్లో వ్యర్థాలను తొలగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సుశీల, శంకర్, సపోర్ట్ జోసఫ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో 'న్యూయార్క్ స్కూల్' ప్రతిభ



చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): హిందూపురంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో న్యూయార్క్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని చైర్మన్ శ్రీధర్ తెలిపారు. ఈ పోటీల్లో వెంకట్‌చరణ్ (9వ తరగతి), భువిక (7వ తరగతి) తృతీయ స్థానం సాధించారన్నారు. వీరిని డైరెక్టర్ లీలాకుమారి, ప్రిన్సిపాల్ చిత్రలతో కలిసి అభినందించారు.

600 లీటర్ల సారా ఊట ధ్వంసం


సారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

విజయపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కేవీపురంలో సోమవారం సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ బలరాం తెలిపారు. సారా స్థావరాలపై జరిపిన దాడుల్లో 600 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. 137 బెల్లం మూటలు, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీని ప్రోత్సహించినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో ఐరాల విద్యార్థులకు పతకాలు



ఐరాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నంద్యాల లోని డీఎస్ఏ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్-14 ఫెన్సింగ్ పోటీలలో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని హెచ్ఎం కోమల తెలిపారు. టీమ్ ఈవెంట్ సాబర్ విభాగంలో గాయత్రి, ఈపీఈఈ విభాగంలో పవన్‌కుమార్‌లు రజత, కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పీడీ దేవా,ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవకార్తిక్, క్రీడాకారులను ఆమె అభినందించారు.

టీడీపీ సీనియర్ నేత మృతికి నివాళి



విజయపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రరాజు మృతదేహానికి చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు సోమవారం పూలమాల వేసి, నివాళి అర్పించారు. చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సుధాకర్‌రాజు, కొండూరు దాము, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

హార్డ్‌వేర్‌కి మంచి భవిష్యత్తు


సమావేశంలో ప్రసంగిస్తున్న నవీన్ కిలారి

పూతలపట్టు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పి.కొత్తకోట సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో సోమవారం జేఈఈఈ కమ్యూనికేషన్ సొసైటీ స్టూడెంట్ చాప్టర్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కాకుండా వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ అండ్ సిస్టమ్ వంటి హార్డ్‌వేర్‌కి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. డాక్టర్ కుమార్, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ లీలాలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ కిలారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి శిరీష, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుంగనూరువాసి నిజాయితీ

- దొరికిన బంగారు గొలుసు బాధితురాలికి అప్పగింత
- నగదు బహుమతి అందజేసిన ఎస్పీ మణికంఠ


మురళికి నగదు బహుమతి అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తనకు దొరికిన బంగారు గొలుసును బాధితులకు అప్పగించి.. నిజాయితీ చాటుకున్నాడో పుంగనూరువాసి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కి అంబోదర గ్రామానికి చెందిన పొన్మణి వచ్చారు. అర్జీ సమర్పించే క్రమంలో తన 30 గ్రాముల బంగారు గొలుసును పర్సులో పెట్టే ప్రయత్నంలో కింద పడేసుకున్నారు. అక్కడికి పుంగనూరుకు చెందిన మురళి కూడా వచ్చి ఉండటంతో ఆ గొలుసును చూశాడు. దీనికి తీసుకుని జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ వద్దకెళ్లి వివరాలు తెలిపాడు. డీఎస్పీ వెంటనే టూటౌన్ సీఐ నెట్టికంఠయ్యను పిలిపించి, విచారించాలని ఆదేశించారు. ఆయన కలెక్టరేట్‌కొచ్చి విచారించగా, ఆ గొలుసు పొన్మణికి చెందినదని నిర్ధారించారు. ఆమెను పోలీసు కార్యాలయానికి తీసుకెళ్లి, ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో మురళి ద్వారా గొలుసును అప్పగించారు. మురళి నిజాయితీని చూసిన ఎస్పీ ఆయనకు నగదు బహుమతి అభినందించారు.